క్లుప్తంగా

అర్జీలను త్వరగా పరిష్కరించండి



తెనాలిఅర్బన్: సచివాలయానికి వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 7,8 వార్డులలో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయా వార్డుల్లో పరిధిలోని సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: రాష్ట్ర ఇమానే మజ్లిస్ కమిటీ సభ్యులు మహెబూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో తెనాలిలో మంగళవారం బిర్యానీని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు షేక్ ఫరీద్ మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 200 మందికి అన్నదానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో షర్ఫునీస్సా, పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి నియమాలు పాటించాలి



తెనాలిరూరల్: రహదారి భద్రతపై రోడ్డు రవాణా శాఖ తెనాలి అధికారుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సును మంగళవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించారు. తెనాలి, కొల్లిపర, చేబ్రోలు, పొన్నూరు, కాకుమాను పరిధిలోని వాహనదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొన్న ఆర్టీఓ కె. శ్రీహరి మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు రహదారి నియమాలను పాటించి ప్రమాదాలను నివారించాలన్నారు. 18 ఏళ్ల లోపు మైనర్లు వాహనాలు నడిపితే ఆ వాహనాలను సీజ్ చేస్తామని, వాహనం నడిపినందుకు అపరాధ రుసుము వేస్తామని చెప్పారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని స్పష్టం చేశారు. అలాగే ఆటోలకి ఆటో పర్మిట్, ఆర్‌సీ, ఇన్స్యూరెన్స్, పొల్యూషన్ వంటి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, అవి కూడా ఆటోలనే ఉంచుకోవాలని చెప్పారు. ఆటో డ్రైవర్లు తమ ఆటో వెనుక డోర్ తీసి ప్రయాణికుల్ని ఎక్కించినా, తమ పక్కన కూర్చోబెట్టుకున్న కేసు నమోదు చేస్తామన్నారు. సదస్సులో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు ఏఎంవీ జి.అమృతవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

కోత మొదలైంది!

- మండలంలో వరి కోతలు ప్రారంభం
- ఎకరానికి 30 నుంచి 35 బస్తాలు దిగుబడి
- ఈ దఫా ఎకరాకు 10 క్వింటాళ్ల మేర తగ్గిన దిగుబడి
- 75 కేజీల బస్తా రూ. 1300 మాత్రమే
- గత ఏడాది 75కేజీలు రూ.2వేలు వరకు ధర పలికిన వైనం
- వాతావరణ మార్పులతో ఆందోళనలో రైతులు
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని ప్రభుత్వం



తూములూరులో మెషిన్ ద్వారా వరి కోత ప్రారంభించిన రైతు

కొల్లిపర: మండల పరిధిలోని తూములూరు, దావులూరు, హనుమాన్‌పాలెం, చివలూరు, కొల్లిపర, మున్నంగి గ్రామంలో మంగళవారం రైతులు యంత్రాల ద్వారా వరి కోతలు ప్రారంభించారు. ఈ సీజన్‌లో మండలంలో 20 గ్రామాలల్లో 12,482 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. రైతులు ఎక్కువగా సన్నాలు బీపీటీలు రకం వేయడంతో దిగుబడి ఎకరాకు 30–35 బస్తాలు వస్తోంది. ఎకరానికి గతంలో పోల్చుకుంటే సుమారు 10 క్వింటాళ్ల దిగుబడి తగ్గిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూలీల రేట్లు అధికంగా ఉండటంతో రైతులు ఎక్కువ శాతం యంత్రాల ద్వారా కోత కోసేందుకు ఇష్టపడుతున్నారు. ఇది ఇలా ఉంటే వాతావరణంలో మార్పులు రావడం, వాతావరణ శాఖాధికారులు నేడు, రేపు వర్షాలు చెప్పటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటు వరి పంట కోతకు వచ్చిన సమయంలో వర్షాలు పడితే చేతికి వచ్చిన పంట నేల పాలు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైన ప్రస్తుతం వరి కోతలు పూర్తి అయే వరకు వర్షాలు లేక పోతే బాగుతుందని అభిప్రాయ పడుతున్నారు.

'మద్దతు' ఏదీ..?

కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం వరి మద్దతు ధర గురించి ఎటువంటి ప్రకటన చేయకపోవటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు గత సంవత్సరంలో వరి కోతల మొదటి దశలోనే 75కేజీల ధాన్యం బస్తా రూ.1900 నుంచి ప్రారంభించి కోతలు చివరి దశకు వచ్చే సరికి రూ.2200 వరకు కొనుగోలు చేశారు. ప్రస్తుతం 75కేజీల బస్తాను రూ.1300 మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. అసలే దిగుబడి తగ్గిందని బాధపడుతుంతే మరొక పక్కన గిట్టు బాటు ధర కూడా లేకపోవటంతో కూటమి ప్రభుత్వంలో తమ పరిస్థితి అధ్వానంగా తయారైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు పాత్రంభించాలని కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాగాణి భూమిలో 3 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నాను. ప్రస్తుతం వరి పంట కోతకు వచ్చి ఉంది. మరో రెండు రోజులల్లో మిషన్ ద్వారా నూర్పిడి చేయాలని అనుకుంటున్నాను. వాతావరణంలో మార్పులు వలన వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. వర్షాలు పడితే చేతికి వచ్చిన పంట నీటి పాలవుతుంది. కాబట్టి కోసిన పంటను వెంటనే అమ్ముకునే విధంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిపించాలి.

– అవుతు ప్రభాకరరెడ్డి, రైతు, వల్లభాపురం

పంట పండినా సంతోషం లేదు



వరి పంట కోతకు వచ్చి ఉంది. కోతలు కోద్దాం అనుకుంటే వర్షాలు అని చెబుతున్నారు. ఏం చేయాలో తెలియడం లేదు. కష్టపడి సాగుచేసి, దిగుబడి బాగున్నా అమ్ముదామంటే ప్రభుత్వం ద్వారా కొనే నాథుడు లేదు. బయట అమ్ముదామంటే అయిన కాడికి అడుగుతున్నారు. అలాగే ఉంచితే వర్షం వస్తే పూర్తిగా దెబ్బతింటాం. మరొక పక్క పంట కోతకు రావటంతో పొలం యజమాని కౌలు చెల్లించమని, ఎరువుల షాపుల యజమానులు ఎరువుల బాకీ చెల్లించమని అడుగుతున్నారు. ఇంతా కష్టపడి సరైన ధర లేకపోవటంతో తక్కువ ధరకు అమ్మినా కొంత బాకీ మాత్రమే తీరుతుంది. ఏం చేయాలో తెలియటం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేస్తే మాలాంటి కౌలు రైతులు కొంతవరకు ఊరట లభిస్తుంది.

– ఎం.నాగేశ్వరరావు, కౌలు రైతు, తూములూరు

పవర్ లిఫ్టింగ్‌లో రేవతికి ఐదు బంగారు పతకాలు



తెనాలి: జగ్గయ్యపేటలో ఈనెల 8–10 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి మహిళల పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పట్టణానికి చెందిన వక్కలగడ్డ రేవతి ఐదు బంగారు పతకాలను సాధించింది. పోటీల్లో 76 కిలోల విభాగంలో పోటీపడిన రేవతి, ఎక్విప్డ్‌లో రెండు బంగారు పతకాలు, అన్‌ఎక్విప్డ్‌లో మరో రెండు, బెంచ్ ప్రెస్‌లో ఒకటి చొప్పున ఐదు బంగారు పతకాలను అందుకున్నారు. స్క్వాడ్‌లో 115 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 42.5 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 120 కిలోల చొప్పున బరువులను ఎత్తినట్టు వివరించారు.

రేపు షుగరు వ్యాధి వైద్యశిబిరం

తెనాలి: ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఈనెల 14వ తేదీన స్థానిక బోసురోడ్డులోని కాకుమాను వృక్కై మెమోరియల్ ఐఎంఏ హాలులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. పట్టణంలోని వివిధ ఆసుపత్రులకు చెందిన ప్రముఖ వైద్యులచే షుగర్‌వ్యాధి పరీక్షలను ఉచితంగా మందులు, అవసరమైన సలహాలను ఇస్తారని ఐఎంఏ, తెనాలిశాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఇదే శిబిరంలో ఉచితంగా కంటి వ్యాధులు, కీళ్ల వ్యాధులు, పిల్లల వైద్యనిపుణులు, స్త్రీల సంబంధిత వ్యాధులకు సంబంధిత వైద్యులచే సలహాలను ఇస్తారని వివరించారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమాజ సేవకుడు తన్నీరు శివశంకర్‌కు జాతీయ పురస్కారం

రేపు రాయచోటిలో జరగనున్న వేడుకల్లో ప్రదానం



తన్నీరు శివశంకర్

తెనాలి: బెంగళూరుకు చెందిన సోమలరాజు ఫౌండేషన్ 12వ వార్షికోత్సవం సందర్భంగా తెనాలికి చెందిన సమాజ సేవకుడు తన్నీరు శివశంకర్‌కు 'భారత సేవారత్న పురస్కారం' ప్రకటించింది. రెండున్నర దశాబ్దాలుగా సత్యం శివం సుందరం సామాజిక సేవా కేంద్రం, వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవా సమితి, మున్సిపల్ బాలుర హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం, తన్నీరు చారిటబుల్ ట్రస్ట్, ఆత్మారామ భక్త బృందం సంస్థలను శివశంకర్ నిర్వహిస్తున్నారు. ఆయా సంస్థలచే విద్య వైద్య, ఆధ్యాత్మిక, సామాజిక రంగాల్లో అందిస్తున్న సేవలకు ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్. శివరాజు తెలియజేశారు. ఈనెల 14న బాలల దినోత్సవం రోజున అన్నమయ్య జిల్లా రాయచోటి పీసీఆర్ మైదానంలో జరిగే ఫౌండేషన్ 12వ వార్షికోత్సవ వేడుకల్లో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్‌లోని గ్రేడ్–1 శాఖా గ్రంథాయలంలో ఈనెల 14వ తేదీ నుంచి 20 వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ సభ జరుగుతుందని గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, మ్యూజికల్ చైర్స్, బాలికలకు ముగ్గుల పోటీలు జరుపనున్నట్లు తెలియజేశారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు వారోత్సవాల ముగింపు రోజైన 20వ తేదీన బహుమతులను అందజేస్తామని తెలిపారు. విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తోడ్పాటును అందించాలని, పెద్దలు, స్థానికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సంగం జాగర్లమూడిలో...

రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలో ఈనెల 14వ తేదీనుంచి ప్రారంభించనున్నట్టు గ్రంథాలయాధికారి జమ్ముల వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

పెదరావూరులో...

రూరల్ మండల గ్రామం పెదరావూరులోని శాఖా గ్రంథాలయంలో ఈనెల 14–20 తేదీల్లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ఎ.రాఘవేంద్ర రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

కొల్లిపరలో...

కొల్లిపర: ఈనెల 14 నుంచి 20 వరకు మండలంలోని అన్ని శాఖల గ్రంథాలయాలల్లో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి బి.సుబ్బారావు తెలియజేశారు. మంగళవారం మండల కేంద్రమైన కొల్లిపర శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల వాల్‌పోస్టర్లులను వివిధ గ్రామాల శాఖల గ్రంథాలయాధికారులతో కలసి ప్రారంభించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

తెనాలిరూరల్: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని తెనాలి ఏడీఏ ఎన్. ఉషారాణి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం అంగలకుదురు, కోపల్లె గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం పర్యటించారు. పొలాలను పరిశలించి గ్రామ సభలు నిర్వహించారు. మండల వ్యవసాయశాఖాధికారి జి.ప్రేమ్‌సాగర్, పశుసంవర్ధక శాఖ వైద్యురాలు డాక్టర్ అనూష, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బాలల చలన చిత్రోత్సవాలు

తెనాలి: చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20వ తేదీవరకు బాలల చలన చిత్రోత్సవాలను నిర్వహించనున్నట్టు ఫిలిం సొసైటీ ప్రధాన కార్యదర్శి బొల్లిముంత కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బాలల్లో సృజనాత్మకశక్తిని పెంపొందించి, భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు బాలల చలనచిత్రాలు దోహదపడతాయని చెప్పారు. ఆసక్తి కలిగిన పాఠశాలల్లో ఫిలిం సొసైటీ ద్వారా అంతర్జాతీయ బాలల చిత్రాలను ఉచితంగా ప్రదర్శిస్తామని తెలిపారు. ఆసక్తి గల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 9959431235 నంబరులో సంప్రదించాలని కోరారు.

వెండి వస్తువులు తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: అక్రమంగా వెండి వస్తువులను తరలిస్తున్న వ్యక్తిని జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. సుమారు రూ. 38 లక్షల విలువైన 38 కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. తెనాలి జీఆర్పీ ఎస్‌ఐ జి.వెంకటాద్రి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తమిళనాడులోని సేలంకు చెందిన హరిరామ్ బాబు శబరి ఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం తెనాలి స్టేషన్‌లో దిగాడు. నాలుగో నంబరు ప్లాట్‌ఫాంపై ఉండగా, అతని వద్ద ఉన్న రెండు సంచులు బరువుగా ఉన్నాయని జీఆర్పీ పోలీసులు గుర్తించారు. అనుమానం వచ్చి తనిఖీ చేయగా 38 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. వాటికి ఎటువంటి రశీదులు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. వెండి వ్యాపారులు ఎటువంటి బిల్లుల లేకుండా వచ్చి స్థానిక దుకాణాలకు విక్రయించి వెళుతుంటారని ఎస్‌ఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.38 లక్షలు ఉంటుందని, ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగిస్తామని చెప్పారు.

బాలికతో యువకుడి అసభ్య ప్రవర్తన

తెనాలిరూరల్: ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలికతో యువకుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. పట్టణ నందులపేటకు చెందిన బాలిక ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. సోమవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి రాగా అదే ప్రాంతంలో నివసించే యువకుడు బాలిక ఇంటికి వచ్చి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో వెళ్లిపోయాడు. బాధితురాలు కుటుంబ సభ్యుల సహకారంతో పోలీసులను ఆశ్రయించగా టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

15న ఆస్తమాకు ఉచిత మూలికా ఔషధం



డాక్టర్ ఆళ్ల నాగిరెడ్డి

తెనాలి: స్థానిక అమరావతి కాలనీలోని కుమారి సుప్రియ స్మారక ఆయుర్వేద ఆసుపత్రిలో ఈనెల 15న ఆస్తమా, అలర్జీ వ్యాధులకు ఉచితంగా మూలికా ఔషధం పంపిణీ చేయనున్నారు. ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో డాక్టర్ ఆళ్ల నాగిరెడ్డి వివరాలను తెలియజేశారు. ఆసుపత్రి తరపున గత 29 సంవత్సరాలుగా ప్రతి ఏటా కార్తిక పౌర్ణమి సందర్భంగా మూలికా ఔషధాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు గుర్తుచేశారు. ఔషధాన్ని సేవించదలచిన వారు నవంబర్ 15వ తేదీన కార్తిక పౌర్ణమి రోజు రాత్రి ఉపవాసం ఉండి పాలు, బియ్యంతో పరమాన్నం తయారు చేసి దానిని పౌర్ణమి వెన్నెలలో రాత్రి మొత్తం మూత లేకుండా ఉంచాలని చెప్పారు. మరుసటి రోజున తెల్లవారుజామున 5 గంటల లోపు పూజానంతరం వెన్నెల్లో ఉంచిన పరమాన్నంలో ఔషధాన్ని కలిపి సేవించాలని సూచించారు. మూలికా ఔషధాన్ని ఒక్కమోతాదు సేవిస్తే ఆస్తమా, అలర్జీ వంటి వ్యాధులు పూర్తిగా నయమవుతాయని డాక్టర్ నాగిరెడ్డి తెలియజేశారు. ఔషధం తీసుకున్నవారు పగలంతా నిద్రపోకూడదని డాక్టర్ నాగిరెడ్డి వివరించారు.

నదీ పరివాహక ప్రాంతాల వారికి మాత్రమే ఉచిత ఇసుక

- ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి
- మండలంలో 9 గ్రామాల వారికి మాత్రమే అనుమతి
- తహసీల్దార్ జి.సిద్ధార్థ



మాట్లాడుతున్న తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంలో భాగంగా వాగులు, వంకలు, నదులులో ఉన్న ఇసుకను నదికి ఆనుకుని ఉన్న గ్రామస్తులు మాత్రమే వారి సొంత అవసరాలకు ఆన్‌లైన్‌లో వారి డేటాను నమోదు చేసి ఇసుకకు ఎటువంటి సొమ్ము చెల్లించకుండా, కేవలం ట్రాక్టర్, ఎండ్లబండికి రవాణా చార్జీలు చెల్లించుకుని లేదా, వారి సొంత వాహనాలలో తరలించుకోవచ్చు అని తహసీల్దార్ జి.సిద్ధార్థ తెలిపారు. మంగళవారం ఫ్రీ ఇసుక విధానంపై ప్రభుత్వం విధివిధానాలు విడుల చేయటంతో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని నదికి ఆనుకుని ఉన్న అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, పిడపర్తిపాలెం, కొల్లిపర, హనుమాన్‌పాలెం, అన్నవరం, బొమ్మువానిపాలెం, అన్నవరపు లంక ఆయా గ్రామాల ప్రజలు నిర్మాణాల నిమిత్తం ఉచితంగా ఇసుక తరలించుకోవచ్చన్నారు. ఉచిత ఇసుక తరలించే సమయంలో ముందుగా ఆయా గ్రామ ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ వైబ్‌సైట్ ట్ప ఖీప్ ఇజౌొరి.జీ ౖ లోకి వెళ్లి ఫ్రీ ఇసుక పై క్లిక్ చేసి వారి ఆధార్ కార్డుతో లాగిన్ అయిన తరువాత నిర్మాణ వివరాలు నమోదు చేసి రసీదు పొందాలన్నారు. ఆ రసీదు ద్వారా ఇసుక తరలించుకోవాలన్నారు. ట్రాక్టర్‌కు ఇంజిన్ ముందు భాగంలో ఉచిత ఇసుక రవాణా అని బ్యానర్ తప్పని సరిగా ఉండాలని సూచించారు. నిబంధనలు పాటించని ట్రాక్టర్‌కి రూ.10వేలు, లారీకి రూ.25వేలు జరిమాన విధించటం జరుగుతుందన్నారు. నదిలో ఇసుక లోడింగ్ సమయంలో పొక్లెయిన్ ఉంటే కేసు నమోదు చేసి రూ.50వేలు జరిమానా విధించటం జరుగుతుందన్నారు. నది పరివాహక ప్రాంత ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. డిప్యూటీ తహసీల్దార్ ఉప్పల రాజేష్, ఆర్ఐ వంశీ కృష్ణ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

అదృశ్యమైన రెండు రోజుల అనంతరం కాల్వలో మృతదేహం లభ్యం



తాడిపర్తి శ్రీనివాస అనిల్(ఫైల్)

తెనాలిరూరల్: స్నేహితులతో కలిసి పార్టీ కోసమని సరదాగా బయటకు వెళ్లిన ఆ వ్యక్తి రెండు రోజుల తర్వాత కాల్వలో శవమై కనిపించాడు. అతడు తిరిగి వస్తాడని ఎంతో ఆశగా ఎదురుచూసిన కుటుంబ సభ్యులకు చివరికి కన్నీరు మిగిల్చాడు. ఘటనకు సంబంధించి పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని 16వ వార్డు ముత్తెంశెట్టిపాలెంకు చెందిన తాడిపర్తి శ్రీనివాస అనిల్ ఇంటివద్దనే టెంట్‌హౌస్ నడుపుకొంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇతడికి భార్య శ్రీలక్ష్మితో పాటు ఐదేళ్ల కుమారుడు ఏడాది వయస్సున్న కుమార్తె ఉన్నారు. శనివారం కుమార్తె మొదటి పుట్టినరోజు వేడుకలను కుటుంబ సభ్యులందరితో కలిసి ఘనంగా జరిపారు. ఆదివారం స్నేహితులతో కలిసి పార్టీ ఉందని బయటకు వెళ్లిన అనిల్ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై వెతకడం ప్రారంభించారు. అనిల్ చెప్పులు, బైక్ ముత్తెంశెట్టిపాలెం వంతెన వద్ద కనిపించడంతో ఏమైందోనని ఆందోళనకు గురయ్యారు. చివరికి త్రీ టౌన్ పోలీసులకు తండ్రి మాధవరావు ఫిర్యాదు కూడా చేశారు. కాల్వలో పడి ఉంటాడన్న అనుమానంతో అంతా కలిసి గాలింపు కూడా చేపట్టారు. ఇంతలో అనిల్ మృతదేహం జగ్గడిగుంటపాలెం వద్ద తూర్పు కాల్వలో వెలుగు చూసింది. మంగళవారం ఉదయం అటుగా వెళ్తున్న వారు కాల్వలో మృతదేహం ఉండటాన్ని గుర్తించి బంధువులకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మొదట మృతదేహం ఎవరిదో అని అంతా అనుకున్నప్పటికీ బయటకు తీసిన అనంతరం అది రెండ్రోజులుగా కనిపించకుండా పోయిన అనిల్ అని నిర్ధారించారు. ఆ రోజు పార్టీకని బయటకు వెళ్లిన అనిల్ తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో వంతెనపై నుంచి కాల్వలో పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. త్రీ టౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాయనమ్మను వేధిస్తున్న మనవడి బైండోవర్



వృద్ధురాలితో మాట్లాడి మనవడు సాయికి కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: నాయనమ్మకు చెందిన ఇంటిని ఆక్రమించుకుని తన పేరున రాయాలంటూ వేధింపులకు గురిచేస్తున్న మనవడిని పోలీసులు తహసీల్దార్ వద్ద హాజరుపరచి బైండోవర్ చేశారు. వృద్ధురాలి వ్యథను విన్న తహసీల్దార్ మనవడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన గరిక దుర్గ రైల్వేశాఖలో స్వీపర్‌గా పని చేసి 2016లో రిటైరైంది. ఈమె భర్త గతంలోనే మృతి చెందాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా అందరికీ వివాహాలై వేరుగా ఉంటున్నారు. తన మనవళ్లలో ఒకడైన గరిక సాయి చెంచుపేట ఇందిరానగర్‌లోని దుర్గ ఇంటిని ఆక్రమించుకున్నాడు. కఠెవరంలోని ఆమెకే చెందిన మరో ఇంట్లో నివసిస్తోంది. ఇంటిని ఆక్రమించుకున్న మనవడు తన పేరున రాయాలంటూ వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో తన బాధను సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో సబ్ కలెక్టర్ సంజనా సింహాకు లిఖిత పూర్వకంగా విన్నవించుకుంది. ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ గోపాలకృష్ణను సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఆయన పోలీసులకు ఆదేశాలివ్వడంతో గరిక దుర్గ, ఆమె మనవడు సాయిలను తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. దుర్గతో మాట్లాడి, ఆమె మనవడికి కౌన్సెలింగ్ ఇచ్చి బైండోవర్ చేశారు. కుటుంబసభ్యులైన వృద్ధులు, తలిదండ్రులను వేధింపులకు గురి చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తహసీల్దార్ హెచ్చరించారు.

గాలి ద్వారా క్షయవ్యాధి వ్యాప్తి

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి అంటువ్యాధి అని, అది గాలి ద్వారా వ్యాప్తి చెందుతుందని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లికొండ రవికుమార్ పేర్కొన్నారు. గంగానమ్మపేటలోని తోటకూర సుబ్బారావు మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం క్షయ వ్యాధిపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలి ద్వారా ఏడాదికి 10 నుంచి 15 మందికి క్షయ వ్యాధి వ్యాప్తి చెందుతున్నారు. క్షయ వ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడితే తగ్గే అవకాశం ఉందన్నారు. రెండువారాలు నుంచి దగ్గు, జ్వరం, కళ్లెలో రక్తచారలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16న 'ఓపెన్ ఫోరం'

తెనాలిఅర్బన్: తెనాలి పురపాలక సంఘ పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 16న మున్సిపల్ కార్యాలయంలో ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందన్నారు. బిల్డింగ్ పర్మిషన్ అప్లికేషన్‌ల పెండింగ్‌లు, డీమ్డ్ ఫైల్స్, ఇతర సమస్యలను ఫోరమ్‌లో పరిష్కరించనున్నట్లు చెప్పారు. అవసరమైన వారు వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

తెనాలిఅర్బన్: డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికుల సమస్యలు, బస్సు సర్వీసుల నిర్వహణపై ఫిర్యాదులు, సూచనలు, సలహాలను తెలియజేయవచ్చునన్నారు. 99592 25422 నంబరులో సంప్రదించాలని కోరారు.